www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 12 ఫిబ్రవరి 2023

పంగిడిమాదార బాధితులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తిర్యాణి మండలంలోని పంగిడి మాదారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి రోడ్డున పడ్డ బాధితులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకురాలు మర్సుకోల సరస్వతి దుప్పట్లు, బట్టలు పంపిణీతో పాటు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకులు బాధితులను ఆదుకోవడంలో విఫలమయ్యారని, ప్రభుత్వం తరఫున బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతన విద్యుత్ లైన్ ఏబి స్విచ్ నిర్మాణంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఫిరోజ్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కుమురంభీం చౌక్, దస్నాపూర్, ఎన్జీవోస్ కాలనీ, కంట కాలనీ, పైకాజీనగర్ ఏరియాలలో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నాండ్లీ మూసివేత..?

- రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు
- ప్రారంభానికి నోచని షట్టర్స్
- 5 ఏండ్లుగా ఎదురుచూపులు
- ప్రజాధనం వథా చేశారంటున్న ప్రతిపక్షాలు

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అనే చందంగా మారింది పురపాలిక పనితీరు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు పాలకుల చిత్తశుద్ధి లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసి చిరు వ్యాపారులకు శాపంగా మారింది. చిరు వ్యాపారులకు జీవనోపాధిని చూపే మున్సిపల్ దుకాణ సముదాయ నిర్మాణ పనులు మూడేళ్లుగా నత్తనడకన కొనసాగాయి. ముందుచూపు లేకుండా ఊసురోమంటూ పనులు పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం స్థలంలో నిర్మించిన ఈ మున్సిపల్ దుకాణ సముదాయం ప్రారంభానికి నోచుకోకపోవడంతో చిరు వ్యాపారస్తులు రోడ్డున పడ్డారు. ఒక వైపు పెరుగుతున్న నిత్యావసర ధరలు మరోవైపు సంపాదనకు మూలమైన దుకాణాలు అందుబాటులోకి రాకపోవడంతో ఎన్నికలు వచ్చినప్పుడే మమ్మల్ని కరుణిస్తారామో ఈ రాజకీయ నాయకులు అని లోలోపల కుమిలిపోతున్న చిరు వ్యాపారుల ఆవేదనను ఎవరూ పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల-మున్సిపాలిటీ మధ్య జరిగిన ఎంఓయూ(మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్)లో నిర్మించి నేటికి ప్రారంభించని మున్సిపల్ దుకాణ సముదాయంలోని 26 షటర్స్‌కు సంబంధించిన వ్యాపారుల దీనగాథ.



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్) నిధులు రూ. కోటితో మినీ స్టేడియం నిర్మాణంలో భాగంగా ప్రధాన రహదారికి ఆనుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 26 షటర్స్ నిర్మించారు. అటు మినీ స్టేడియం పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో పాటు సదరు కాంట్రాక్టర్‌తో కొందరి నాయకుల మధ్య ఏర్పడిన విభేదాలు సామాన్యుని పాలిట శాపంగా మారాయి. రూ.27లక్షల అదనపు వ్యయంతో షట్టర్స్ నిర్మాణం పూర్తయినప్పటికీ నేటికి ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ముందుచూపు లేని నిర్మాణాలు

మున్సిపాలిటీ అధికారుల ముందుచూపు లేని తనంతో రాబోయే మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌లో ఇప్పుడు నిర్మించిన షట్టర్స్‌ను తొలగించడం అనివార్యమని తెలుస్తోంది. మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న అప్పటి హడావిడి నిర్ణయాలు ప్రజాధనంపై పాలకులకు, అధికారులకు పట్టింపులేదని రుజువు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరువైపులా 33 ఫీట్ల వెడల్పుతో రోడ్డు ఉన్నప్పటికీ మాస్టర్ ప్లాన్ అమలుతో కనీసం 56 నుంచి 60 ఫీట్ల వరకు రోడ్డు వెడల్పు చేయాల్సి ఉంటుంది. దీంతో ప్రజా పన్నులతో నిర్మించిన ఈ 26 షట్టర్స్, మినీ స్టేడియం నిర్మాణంలోని కొంతభాగంతో పాటు ఆక్రమణలో ఉన్నటువంటి ప్రయివేట్ వ్యక్తుల దుకాణాలు, ఇతర నిర్మాణాలు కూలగొట్టడం తప్పనిసరిగా మారనున్నట్లు సమాచారం. సుమారు రూ.కోటి నిధులు పెట్టి చేస్తున్న ఈ అసంపూర్తి నిర్మాణాలతో ఎవరికి లబ్ధి చేకూరిందో అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోనుంది.

కళాశాల మైదానం కుదింపు

మినీ స్టేడియం నిర్మాణంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం కుదించబడటమే కాకుండా మైదానం చుట్టూ ప్రహరీగోడ నిర్మించే క్రమంలో కొందరు ప్రయివేట్ వ్యక్తులు కళాశాల మైదానం స్థలాన్ని కొంతమేర కబ్జా చేసినట్లు ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నాయకులు చేపట్టిన పనులు కావడంతో ఆక్రమణల గురించి ఎవరూ పెదవి విప్పే సాహసం చేయలేదనే ప్రచారం ఉంది. ఇదిలా ఉండగా పరస్పర అవగాహన ఒప్పందంలో భాగంగా నిర్మించిన షట్టర్స్ ద్వారా వచ్చే ఆదాయంలో కళాశాలకు, మున్సిపాలిటీకి 50:50 శాతం ఆదాయాన్ని పొందాలి. కళాశాల అభివృద్ధి నిధుల కోసం షట్టర్స్ ద్వారా కిరాయి ఆదాయంలో నుంచి 50శాతం కళాశాలకు ఇస్తామని అప్పటి కలెక్టర్, ఇంటర్మీడియట్ విద్యా శాఖ కమిషనర్ మధ్య ఒప్పందం కుదిరింది. కానీ ఈ 26 షట్టర్స్ అసలు ప్రారంభానికే నోచుకోకపోవడంతో గవ్వ ఆదాయం కళాశాలకు రాలేదని ఆ కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈఓ శైలజ 'నవ తెలంగాణ'కు తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం

గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని రోడ్డు వెడల్పులో భాగంగా దుకాణాలు కోల్పోయిన చిరు వ్యాపారులకు నేటికీ కంటి మీద కునుకు లేకుండా పోయింది. సుమారుగా 50మందికి పైబడిన ఈ చిరు వ్యాపారులు తమ దుకాణాలను కోల్పోవడంతో నేడు కేవలం 26 మందిని మాత్రమే లబ్దిదారులుగా ఎంపిక చేస్తామనే పాలకుల, అధికారుల ప్రచారంతో మిగతా చిరు వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. రోడ్డును ఇరువైపులా వెడల్పు చేయాల్సి ఉండగా కేవలం ఒకవైపు మాత్రమే వీధి వ్యాపారుల దుకాణాలు తొలగించి అన్యాయం చేశారని అప్పట్లోనే చిరు వ్యాపారులు పాలకులను, అధికారులను నిలదీశారు. దీంతో అప్పటి తంతు ముగించడానికి తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలో ఈ వ్యాపారులకు దుకాణాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు కాలేదు.

ప్రారంభంపై పట్టింపేది?

26షట్టర్స్ నిర్మాణం 5నెలలు క్రితం పూర్తయినప్పటికీ వాటిని ప్రారంభించకపోవడంతో పురపాలిక ప్రజలు, చిరు వ్యాపారులు పాలకులు, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. గత దీపావళితో పాటు ఈ నూతన సంవత్సరం ప్రారంభంలో లేదా మొన్నటి జనవరి 26న దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తారనే ఊహగానాలు వినిపించినప్పటికీ చిరు వ్యాపారులకు ఎదురు చూపులే మిగిలాయి. ఇప్పటికైనా మున్సిపల్ పాలకులు, అధికారులు దుకాణ సముదాయాన్ని వెంటనే ప్రారంభించి, తమ జీవనోపాధికి బాసటగా నిలవాలని చిరు వ్యాపారులు వేడుకుంటున్నారు.

ఎమ్మెల్యే, చైర్మన్ పట్టించుకోవడం లేదు : వెంకటస్వామి, టైలర్




షట్టర్స్ నిర్మాణం పూర్తయి 5 నెలలు గడుస్తున్నా మాకు అందజేయడం లేదు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ చుట్టూ తిరగడమే అవుతుంది. వారు మా బాధలను పట్టించుకోవడం లేదు. జీవనోపాధి కోల్పోయి కిరాయిలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. తహసీల్దార్ కార్యాలయం ఏరియాలో స్థలాలు ఇస్తామని ముగ్గు పోసినప్పటికీ అది ఆచరణలో లేకుండా పోయింది. 5ఏండ్లుగా ఎన్నో బాధలు పడుతున్నాం.

షట్టర్స్ అందించి ఆదుకోవాలి : నారాయణ, నాయీబ్రాహ్మణుడు



ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. చిరు వ్యాపారాల పాలకుల నిర్లక్ష్యంతో దెబ్బతింటున్నాయి. రోజు గడవడం కష్టంగా ఉంది. షట్టర్స్‌ను ప్రారంభించి వెంటనే మాకు అందించాలని కోరుతున్నాం.

షట్టర్స్ నిర్మాణంతో ప్రజలకు లాభం లేదు : ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ



ముందు చూపు, శాస్త్రీయ ప్రమాణీకత లేకుండా పిట్టగూళ్ల లాగా నిర్మించిన ఈ షట్టర్స్‌తో చిరు వ్యాపారులకు లాభం లేదు. ప్రజా ధనం వథా చేయడమే కాకుండా కాలేజ్ గ్రౌండ్‌ను నాశనం చేశారు. ఎమ్మెల్యే, చైర్మన్ చెప్పే మాటలకు చేసే పనులకు సంబంధం ఉండటం లేదు. కళాశాల ఆవరణలోనే ఉన్నటువంటి ప్రభుత్వ హైస్కూల్ నేడు శిథిలావస్థలో ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

త్వరలోనే ప్రారంభిస్తాం : ఆకుల వెంకటేష్, మున్సిపల్ కమిషనర్



కొన్ని సాంకేతిక కారణాలతో షట్టర్స్ ఓపెనింగ్ ఆలస్యం అయింది. లబ్దిదారుల జాబితా సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే షట్టర్స్ ప్రారంభించి చిరు వ్యాపారుల జీవనోపాధికి కృషి చేస్తాం.

గురుకులాల పార్ట్ టైం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఐక్య గురుకులాల కార్యదర్శి దూలం ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతి కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులలో పనిచేసే పార్ట్ టైం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. పార్ట్ టైం ఉపాధ్యాయుల పేరును కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా పేరును మార్చాలన్నారు. అన్ని గురుకులాల్లో పనిచేసె ఉపాధ్యాయులందరికి ఒకే రకమైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెండవ హిందీ ఉపాధ్యాయులకు పీఆర్సీ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంల టీఎస్ యూటీఎఫ్ ఆసిఫాబాద్ జనరల్ సెక్రెటరీ ఇందురావు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లు, స్థలాలు ఇవ్వాలి..
రేపటినుంచి రిలే నిరాహార దీక్షలు

ప్రజలు జయప్రదం చేయాలి

సీపీఐ(ఎం) సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మూషం రమేష్

నవతెలంగాణ - సిరిసిల్ల

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాని అర్హులైన వారికి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13నుంచి సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తెలిపారు. ఈ దీక్షలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చి 9 సంవత్సరాలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల హామీ నెరవేర్చలేదన్నారు. అనేకసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ దరఖాస్తులు ఇస్తున్నారని వాపోయారు. పేదలకు 120 గజాల స్థలం ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. ఎకరాల ప్రభుత్వ స్థలం పెట్టుబడిదారులకు ఇవ్వడానికి ఆదేశాలు జారీ చేస్తున్నారని విమర్శించారు. ఓట్ల కోసం సీట్ల కోసం కాకుండా పేదల కోసమే పనిచేస్తున్నది సీపీఐ(ఎం) మాత్రమేనని అన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు, ఇల్లు నిర్మించుకోవడానికి 5లక్షల రూపాయలు ఇవ్వాలని పోరాడుతుందని తెలిపారు. ఈ నెల 13నుండి సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే రిలే నిరాహార దీక్షలలో అర్హులై కూడా డ్రాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాని వారందరూ పాల్గొనాలని కోరారు. ఉదయం 10 గంటల వరకు సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని, ప్రభుత్వంపై పోరాటం చేసి సాధించుకోవాలని అన్నారు.

శాసనమండలి చీఫ్‌విప్‌గా భానుప్రసాదరావు

నవతెలంగాణ - పెద్దపల్లి

తెలంగాణ శాసనమండలి చీఫ్‌విప్‌గా కరీంనగర్ ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భానుప్రసాదరావు మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలుపొందారు. గతంలో శాసనమండలి విప్‌గా పనిచేశారు. ఆయన నియామకం పట్ల పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

రాజన్న సేవలో ప్రముఖులు

నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని శనివారం కర్నాటక రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఈవీ.రమణారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మడపంలో ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. కరీంనగర్ వాస్తవ్యుడైన రమణరెడ్డి ప్రస్తుతం కర్నాటక రాష్ట్ర వాణిజ్యం, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ విభాగాల అడిషనల్ చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి శనివారం రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆమెను ఆలయ అర్చకులు ఆశీర్వదించారు.

'దళితులను దగా చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం'

నవతెలంగాణ - ఇల్లంతకుంట

రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులని పూర్తిగా వంచిస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పసుల వెంకట్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ఎమ్మెల్యే రసమయి మాటలు నీటి మూటలుగా ఉన్నాయని అన్నారు. దళితులకు 1200 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కడ పంచిందో ఏమో గాని, గూడెం గ్రామంలో లంచాలు ఇచ్చుకోలేక ఒక మనిషి మాత్రం ప్రాణాలు వదిలాడని వాపోయారు. కబ్జాకోరులను పక్కన పెట్టుకుని అసైండ్ భూములను పట్టాలుగా, పట్టా భూములని మార్చుకోవడం కోసం దొరల ఇలాకాలో ఉన్న బెజ్జంకి మండలాన్ని సిద్దిపేట జిల్లాలో కలుపుకున్నాడని ఆరోపించారు. కల్లెపల్లి గ్రామములో దళితుల భూములను కొల్లగొట్టిన భూస్వామికి వంతపాడుతున్నారని ఆరోపించారు. దళితులను ముందు పెట్టి బీసీ, ఓసిల గొంతునొక్కి కేసులు పెట్టించి ఆనందాన్ని అనుభవిస్తున్నారని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ - ముత్తారం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన దొంతరవేన సదయ్య (47) ఆస్పత్రిలో చికిత్స పొందుతు పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ నెల 3న బైక్ ఢీకొనగా గాయపడ్డ సదయ్యను హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నారు. శనివారం పరిస్థితి విషమించి మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

కారుణ్యం..కనికరించని యాజమాన్యం..!

- నాలుగేండ్లుగా విజిలెన్స్ చెరవీడని ఫైళ్లు
- 400 మంది డిపెండెంట్ల ఎదురుచూపులు
- వన్‌టైం ఉద్యోగ అవకాశం కల్పించాలని వేడుకోలు
- కార్మిక సంఘాలతో ఒప్పందం కుదిరినా కదలని దస్త్రం

చిన్నచిన్న కారణాలతో సింగరేణి వ్యాప్తంగా నాలుగు వందలకుపైగా కార్మికుల పిల్లల కారుణ్య నియామకాలు నిలిచిపోయాయి. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, కార్మిక సంఘాలు విన్నవించినా యాజమాన్యం మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. నాలుగు దశాబ్దాల పాటు సంస్థ కోసం తమ రక్తాన్ని చెమటగా మార్చి మలిదశలో వారసునికి ఉద్యోగం వస్తే కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటుందన్న కార్మికుల పరిస్థితి దీనంగా మారింది. అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయి వేతనం లేక కుటుంబ పోషణ చాలా భారంగా మారుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారసునికి ఉద్యోగం రాక బతుకులు భారంగా మారాయని 2021 డిసెంబర్‌లో జరిగిన సమ్మెలో కార్మిక సంఘాల జేఏసీ కూడా ఈ విషయాన్ని డిమాండ్‌గా చేసి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. చర్చల్లో సానుకూలంగా ప్రకటించిన అమలులో మాత్రం అలాగే ఉండిపోయింది. కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు లభించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఆదేశించినా ఆశించిన స్థాయిలో అధికారులు స్పందించడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



నవతెలంగాణ - రెబ్బెన

ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో సింగరేణి కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. నాలుగేండ్ల కిందట కారుణ్య నియామకాలు ప్రారంభం కాగా పలువురికి ఉద్యోగవకాశాలు కల్పించి సంస్థం హక్కును చేర్చుకుంది. అయితే కొంత మందికి మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది.

30 ఏండ్లు దాటాయని..

సింగరేణి విజిలెన్స్ పరిధిలో 400కుపైగా కారుణ్య కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 30 ఏండ్లు నిండిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చే విషయంలో ఫైళ్లు పెండింగ్‌లో పెట్టారు. అయితే కార్మిక సంఘాల జేఏసీతో చర్చించిన సమయంలో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 40 ఏండ్ల వయసు వరకు కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని యాజమాన్యం అంగీకరించింది. త్వరలోనే విధివిధానాలు ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ విషయాన్ని గుర్తింపు యూనియన్ టీబీజీకేయస్ అధ్యక్షుడు డి వెంకట్రారాం ప్రకటించారు. అయినా అమలుకు మాత్రం నోచుకోలేదు.

రెండు పేర్లపై రాని స్పష్టత

రెండు పేర్లపై ఇప్పటివరకు స్పష్టత వీడలేదు. నాలుగు దశాబ్దాల పాటు సంస్థ కోసం పనిచేసి అనారోగ్యం బారినపడి మెడికల్ అన్‌ఫిట్ పెట్టుకుంటే అన్‌ఫిట్ చేసిన యాజమాన్యం వారి పిల్లలకు ఇప్పటివరకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. రెండేండ్లు గడుస్తున్నా సవాలక్ష నిబంధనలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 ఏండ్లు పనిచేస్తే అడ్డురాని రెండు పేర్ల ఇబ్బంది కార్మికుని కొడుకుకు ఉద్యోగం విషయంలో మాత్రం ఎందుకు వస్తుందని ప్రశ్నిస్తున్నారు. సొంత కొడుకు, కూతరు, అల్లుడు అనే అంశాన్ని చూడాలే తప్ప ఊరిలో ఏముంది, దానిపై ఏం పేరుందని విజిలెన్స్ అధికారులు వేధిస్తూ రెండేండ్ల పాటు ఫైళ్లను పెండింగ్‌లో పెడుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు. జీఎం కార్యాలయాల చుట్టూ తిరగలేక కుటుంబపోషణ చాలా భారంగా ఉందని కార్మికులు వాపోతున్నారు.

కార్మిక సంఘాల జేఏసీకి హామీ ఇచ్చినా...

2021 డిసెంబర్‌లో కార్మిక సంఘాల జేఏసీ సంస్థలో మూడు రోజుల పాటు సమ్మె నిర్వహించి ఈ సందర్భంగా కార్మికుల పిల్లలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 40 ఏండ్ల వరకు అంగీకరించాలని కోరారు. అలాగే ఊరిలో ఒక పేరు బాయిమీద మరొక పేరు కుటుంబంలో ఇద్దరు భార్యలుంటే మొదటి భార్యకు కూడా అన్నీ విధివిధానాలు సరైనవిగా రాసి ఇచ్చారు. రెండో భార్య విధివిధానాలు సైతం రాసి ఇచ్చినా కూడా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ ఇప్పటివరకు ఉద్యోగం లేక పిల్లలు రోడ్డున పడే అవకాశం ఉందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. మారుపేర్ల విషయంలో కార్మికులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరింది. మారుపేర్లు మార్చుకునేందుకు కోర్టు లేదా తహసీల్దార్ కార్యాలయం ద్వారా సర్టిఫికెట్ తీసుకొస్తే అంగీకరిస్తామని యాజమాన్యం చెప్పినా అమలులో మాత్రం ముందుకు సాగలేదు. దీంతో సంస్థ వ్యాప్తంగా యాజమాన్యం ఆదేశాల కోసం కార్మిక కుటుంబాలు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి స్పష్టమైన ఆదేశాలివ్వాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

నిషేధిత బీటీ విత్తనాల పట్టివేత



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ గ్రామ శివారులోని బోయపల్లె బోర్డు వద్ద టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్సై లచ్చన్న, సిబ్బందితో కలిసి 5క్వింటాళ్ల నిషేధిత బీటీ విత్తనాలను పట్టుకున్నారు. మంచిర్యాల వైపు వస్తున్న కారు, బొలెరో ట్రాలీ ఆపి తనిఖీ చేయగా బొలెరో ట్రాలీలో వడ్ల బస్తాల కింద సుమారు 10లక్షల విలువైన 5క్వింటాళ్ల ప్రభుత్వ నిషేధిత(బిటి-3) విత్తనాలు పట్టుబడ్డాయి. శ్రీరాముల నవీన్, ఒడ్నాల రాకేష్, మోర్ల వెంకటస్వామిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు నిందితులను విచారించగా కొడిపాక రంజిత్, గాండ్ల మహేష్ వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నామని తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అంబేద్కర్‌ను అవమానించిన వ్యక్తిని శిక్షించాలి



కౌటాల : అంబేద్కర్‌ను అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎంపిపి విశ్వనాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. బౌద్ధ సమాజ్ సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బసార్కర్ విశ్వనాథ్, మండల అధ్యక్షుడు బండోరావ్, సమతా సైనిక్ దళ్ మండల అధ్యక్షుడు అశోక్, నేతకాని మహార్ సంఘం మండల అధ్యక్షుడు దుర్గం జానకిరామ్, తాలూకా కోశాధికారి మోహన్‌లాల్, మండల ప్రధాన కార్యదర్శి కొండగొర్ల దేవాజీ, మండల ఉపాధ్యక్షుడు దుర్గం మారుతి, డోంగ్రి మధుకర్, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య



రామకృష్ణాపూర్ : రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్త తిమ్మాపూర్‌లో నివాసముంటున్న మలుబాక జోత్స్నరాణి ఇంట్లో శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త సత్యనారాయణ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీని గురించే ఆలోచిస్తూ మానసిక క్షోభకు గురై జీవితం మీద విరక్తి చెంది సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. నాలుగైదు సంవత్సరాలుగా మతిస్థిమితం కూడా సరిగా లేదు. హైదరాబాద్‌లో చికిత్స చేయించి మందులు వాడుతున్నారు. కొడుకు, కూతురు విదేశాల్లో స్థిరపడ్డారు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎఎస్ఐ రజిత తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని మాలీ సంక్షేమ సంఘం భవనంలో సీఎం చిత్రపటానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడె వసంతరావు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాలీ కులస్తులు అధిక సంఖ్యలో పేదరికంలో ఉన్నారని, అనేక సంవత్సరాలుగా ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన పోరాటాలకు ఫలితం లభించిందని అన్నారు. అసెంబ్లీలో ఎస్టీ జాబితాలో చేర్చడానికి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించిన సిఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షుడు నికోడే గంగారాం, సర్పంచులు ఆడె శ్రీనివాస్, నిహారిక, జ్యోతిరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం రూ.25 లక్షల సీసీ రోడ్డు పనులను పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. గ్రామ ప్రజల సహకారంతో మరింత గ్రామ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ మాణిక్ రెడ్డి, వైస్ చైర్మెన్ లక్ష్మీ నారాయణ, వైస్ ఎంపీపీ పతాని రాధా, గ్రామ సర్పంచ్ దండు సాయి కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడికి విశ్రాంత కలెక్టర్ పరామర్శ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ ఉద్యమకారుడు ఉపాధ్యాయుడు రాథోడ్ అనిల్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కిమ్స్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని, ఇంద్రవెల్లిలో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రిటైర్డ్ కలెక్టర్ శర్మన్ నాయక్ శనివారం ఆయనను పరామర్శించారు. ప్రస్తుతం ఆతని ఆరోగ్య విషయాలపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచ్ లక్ష్మీ సుభాష్, పరుశురాం నాయక్ ఉన్నారు.



ప్రయివేటు పనులకు పంచాయతీ ట్రాక్టర్

- గ్రామపంచాయతీ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-తలమడుగు

కంచె చేను మేస్తే కాసేవారేవరు అన్న చందంగా గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను సొంత పనులకు ఉపయోగించుకుంటూ లాభాలు గడిస్తున్నారు కొందరు. పల్లెలే దేశానికి పట్టు కొమ్మలు అని పల్లెలను అభివృద్ధి పరిచేందుకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లను మంజూరు చేసింది. గ్రామపంచాయతీ పనులైనటువంటి పల్లె ప్రకృతి వనాలకు నీళ్ల పట్టించడం, గ్రామంలోని మురికి కాలువల్లోని చెత్తను డంపింగ్‌యార్డులకు తీసుకెళ్లడం, ఇతర గ్రామపంచాయతీ పనులు చేయాల్సి ఉంటుంది. కాని దీనికి భిన్నంగా కొందరు ప్రజాప్రతినిధులు తమ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, తమ ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని కొత్తూర్ గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి తమ చెక్‌డ్యాం పనులకు ఉపయోగించుకుంటున్నాడు. గ్రామపంచాయతీకి నష్టాన్ని కలిగిస్తున్నట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ ఈఎంఐ కట్టలేని పరిస్థితుల్లో గ్రామపంచాయతీ ఉన్నాయి. అవి చెడిపోతే మరమ్మతులు చేయించలేని పరిస్థితుల్లో గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాక్టర్లను ప్రయివేటు పనులకు ఉపయోగిస్తూ గ్రామపంచాయతీకి నష్టాన్ని కలిగించే విధంగా తన స్వంత పనులకు వినియోగించుకున్నాడు. ఇదంతా తెలిసినప్పటికీ అధికారులు తమకు ఏమీ తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ ట్రాక్టర్లను ప్రయివేటు పనులకు వినియోగించ కుండా పంచాయతీ పనులకు ఉపయోగించాలని, పంచాయతీ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామపంచాయతీ ట్రాక్టర్ ప్రయివేటు పనులకు ఉపయోగిస్తున్నట్టు అధికారులకు తెలిసినప్పటికి, తమకేమీ తెలియదన్నట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే ఇలా ప్రయివేటు పనులకు ఉపయోగిస్తున్నారని పలువురు వాపోతున్నారు.



అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-భైంసా

తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని భైంసాలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలు సంపూర్ణ, ఉపాధ్యక్షురాలు అరుణ, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు దావుల అనసూయ ఉపాధ్యక్షురాలు ఉజ్వల సమక్షంలో భైంసా ప్రాజెక్ట్‌కు సంబంధించిన సెక్టార్ కమిటీలను ఎన్నుకున్నారు. సిద్ధార్థనగర్ కమిటీ సభ్యులుగా అఫ్రోజ్ ఖానాం, సంధ్యారాణి, కామోల్ సెక్టార్ కమిటీ సభ్యులుగా అనురాధ, యశోద, మహాగామ్ సెక్టార్ సభ్యులుగా సురేఖ, అనురాధ ఒవైసీ నగర్ కమిటీ సభ్యులుగా శోభ, మాధురిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సంపూర్ణ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో సమస్యల సాధన కోసం పాటుపడతామని అన్నారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ సీఈఓ వెంకటి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

అనారోగ్యంతో ఉట్నూర్ పీఏసీఎస్ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటి(56) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటి గత కొన్ని రోజుల క్రితం నుంచి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం కారణంగా మహారాష్ట్రలోని పలు ప్రయివేటు ఆస్పత్రిలలో చూపించిన తగ్గలేదన్నారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామమైన మండలంలోని ఏంకా గ్రామంలో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ బాలాజీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దాసండ్ల ప్రభాకర్, నాయకులు, రైతులు వెంకటి గ్రామానికి చేరుకొని ఆయనకు నివాళులర్పించారు. పదవిలో ఉన్నంత కాలం రైతుల అభివృద్ధికి కృషి చేసినట్టు తెలిపారు. ఆయన అకాల మరణం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీహార్ పట్నాలో జరుగుతున్న నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు సత్తా చాటాడు. బజార్‌హత్నూర్‌కు చెందిన మడావి సోము అండర్-16 ట్రయాథ్లాన్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారు. దేశవ్యాప్తంగా ఉన్న 2వేల మంది క్రీడాకారులు ట్రయాథ్లాన్‌లో పాల్గొనడం విశేషం. వెండి పతకం సాధించిన మాడావి సోముతో పాటు కోచ్‌లు వీజీఎస్ రాకేష్, స్వప్న, విజయ జ్యోతిశ్వరన్‌లను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడ్డి భోజా రెడ్డి, జనరల్ సెక్రటరీ రాజేష్, పేట అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి ప్రత్యేకంగా అభినందించారు.

రాజీతోనే సమస్యల పరిష్కారం

- సివిల్ జడ్జి దుర్గారాణి

నవతెలంగాణ-ఉట్నూర్

రాజీతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, రాజీ మార్గమే రాజమార్గమని ఉట్నూర్ సివిల జడ్జీ దుర్గారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ కోర్టులలో కేసులున్న వారు రాజీతోనే సమస్యల పరిష్కారానికి సులువైన మార్గమని అన్నారు. ఎన్నో ఏండ్ల నుండి కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులను పరిష్కరించడానికి ఇలాంటి లోక్ అదాలత్ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారులు రాజీపడటం ఉత్తమమని అన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు ఉన్నారు.

'కేంద్రం నిధులను దారి మళ్లించారు'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రం పేదలకు కేటాయించిన నిధులను దారి మళ్లించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని కేఆర్‌కే కాలని, శ్రీరామ్ కాలనీలలో బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు విడుదల చేసిందని, పేరుకు కొన్ని పనులు చేసి మిగతా సొమ్మంతా అధికార పార్టీ నాయకుల జేబుల్లోకి పోయిందని ఆరోపించారు. వెనుకబడిన కాలనీలలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బోయర్ విజయ్, మయూర్ చంద్ర, లాలా మున్నా వేణుగోపాల్, ధోని జ్యోతి, గంగారెడ్డి, దినేష్ మాటోలియ, రవి, మహేందర్ సునందరెడ్డి, సాయికిరణ్, రాజేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ మోసాలకు మునుగోడు ఎన్నికలే సాక్ష్యం

నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్



కేసీఆర్ మోసాలకు మునుగోడు ఎన్నికలే సాక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. శనివారం మండలంలోని అంకోలి, తంతోలి గ్రామాల్లో బీజేపీ శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌లో పాల్గొని, మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ మోసపూరిత మాటలకు అంతు లేదన్నారు. అందుకు మునుగోడు ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. మునుగోడు ఎన్నికల్లో గొల్లకుర్మలకు చేసిన మోసం మనందరికీ తెలిసిందే అన్నారు. గొర్రెలను కొనుగోలు చేయడంలో మీకు ఉన్న నైపుణ్యం, ప్రభుత్వ అధికారులకు ఉండదని అన్నారు. అందుకే మీకు ఇవ్వాల్సిన గొర్రెలకు బదులు మీ ఖాతాల్లో నగదు వేస్తామని మీరు గొర్రెలు కొనుక్కోండని చెప్పి వారి ఖాతాల్లో డబ్బులు జమచేసి ఎన్నికలవగానే డబ్బులు వెనక్కి తీసుకున్న వైనమే ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు వాగ్దానాలతో ముంచెత్తి ఎన్నికలు కాగానే మొఖం చాటేశారని అన్నారు. ప్రజలకు మేలు చేసే పనులు మాత్రం ముందుకు సాగవు అందుకు ఉదాహరణ ఆదిలాబాద్ లోని తాంసి బస్టాండ్ రైల్వే బ్రిడ్జ్ 2014 ఎన్నికల్లో, 2018 ఎన్నికల్లో ఈ సారి తప్పకుండా చేయిస్తామంటూ మోసం చేశారని అన్నారు. ప్రజలారా ఈ మోసగాళ్ల బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలనాయకులు మండల అధ్యక్షులు సంతోష్, దయాకర్, మయూర్ చంద్ర, స్వామి, విజయ్, ధోని జ్యోతి, సునంద రెడ్డి, లాలా మున్న కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసులను సత్వరంగా పరిష్కరించేందుకే లోక్‌అదాలత్

- జిల్లాలో 1,216 కేసులు పరిష్కారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా కేసులను సత్వరంగా పరిష్కరించేల హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత సూచించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. కక్షిదారుల మధ్య రాజీ కుదురుస్తు, కేసులను పరిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,216 కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించారు. 1,038 క్రిమినల్, 6 సివిల్, 172 బ్యాంక్ పీఎల్సీ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునిత మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులతో కేసులు నమోదై కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరుగుతూ సమయంతో పాటు డబ్బులను వృదా చేసుకుంటున్నారని అన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునే విధంగా హైకోర్టు ప్రతి రెండు నెలలకు ఒక సారి జాతీయ లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తుందని అన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే అంతే సంగతి..

పోలీసులు డ్రంక్ డ్రైవ్‌లో నిత్యం వందల మంది పట్టుబడుతున్నారని అన్నారు. ఇటీవల ఒక రోజు జైలు శిక్షణ విధించిన మార్పు రాలేదని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. ఈనెల 12 నుండి ఆదివారం నుండి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడితే కఠినంగా శిక్షలను అమలు చేసే యోచనలో ఉన్నామని అన్నారు. కోర్టులోని మరుగుదోడ్లను శుభ్రం చేయిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు ప్రమీల జైన్, మంజుల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, ఏఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో అన్నదానం...

ఆదిలాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో శనివారం సత్యసాయి ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా అధ్యక్షులు నర్సింహరావు మాట్లాడుతూ సత్యసాయి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌కు మారుమూల జిల్లా నుండి వచ్చిన వారికి మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇబ్బంది అవుతుందని ఈ క్రమంలో కోర్టు ఆవరణంలో భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ విలాస్ ఉన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తుల నగదు బదిలీల పరిశీలన

నవతెలంగాణ-తాంసి

క్షయ వ్యాధి గ్రస్తులకు ఇచ్చే నగదు బదిలీపై శనివారం భీంపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మర్యగూడ, బెల్సరీ రాంపూర్, అందర్‌బంద్, లింబుగూడ, ధనోర, వడ్గాం గ్రామాలలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నమోదైన క్షయ వ్యాధి ఉన్న రోగులలో ప్రత్యక్ష బదిలీ (నిక్షయ్ పోషణ యోజన)పథకం మూల్యాంకనం కోసం (ఐసీఎంఆర్) నేషనల్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజి బృందం సభ్యులు శిరీష, జయశ్రీ, అపర్ణ ప్రాజెక్ట్ రిసెర్చ్ అసిస్టెంట్స్ సభ్యులు అయ గ్రామాల్లో ఉన్న వ్యాధి లక్షణాలు ఉన్న వారిని కలిసి నగదు బదిలీ ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ ద్రవ్య ప్రయోజనాన్ని అర్థం చేసుకోవడానికి, నగదు ప్రయోజనం, ప్రయోజనాల పంపిణీలో న్యాయాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. మీ వ్యక్తిగత గుర్తింపు, వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరచడానికి తగిన జాగ్రత్తలు తీసుకొనబడతాయని అన్నారు. మీకు సంబందించిన డేటా శాస్త్రీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగపడుతుందని అన్నారు. క్షయవ్యాధితో బాధపడుతున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నప్రభ సంతోష్, సర్పంచ్‌లు గెడం శంకర్, పేడెపు కృష్ణ, ఆరోగ్య సిబ్బంది బి.గంగాధర్, లచ్చుబాయి, జానాబాయి, విజయలక్ష్మి, గోదావరి ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధియే ప్రభుత్వ ధ్యేయం

- పీఏసీఎస్ చైర్మెన్ డోంగ్రె మారుతి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గ్రామాల అభివృద్ధియే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని, మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మెన్ డోంగ్రె మారుతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇంద్రవెల్లి నుండి అందునాయక్ తండ వరకు రూ.28 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన బీటీ రోడ్ పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత అభివృద్ధియే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల సంక్షేమం కోసం మిషన్ భగీరథ, కళ్యాణ లక్ష్మి, రైతుబంధు దళితబంధు లాంటి ప్రతిష్టాత్మకమైన పథకాలను అమలు చేస్తున్నా ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. అనంతరం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ అంజద్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్ సింగ్, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సూఫీయాన్, మాజీ సర్పంచ్ కోరేంగా సుంకటరావు, బీఆర్ఎస్ నాయకులు దేవుపూజే మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని అర్లి(క) గ్రామంలో శనివారం పశువైద్య శిబిరాన్ని జెడీపటీసీ గోక గణేష్ రెడ్డి ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మండల రైతులను కోరారు. పశువైద్యుల సలహాలు సూచనలు పాటించి, వాటికి గర్భ కోశ చికిత్సలు చేయించి, మేలు జాతి దూడలను పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. జిల్లా పశువైద్య ఆదికారి కిసాన్ మాట్లాడుతూ కట్టని పశువులకు డాక్టర్‌ను సంప్రదించి గొడ్డు బారీతనం నుండి కాపాడి పరీక్షించు కొని ఏదకు వచ్చే విధంగా చేసుకోవాలని అన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలురకం దూడలను పొందాలని కోరారు. జిల్లా మొత్తంలో ఈ సందర్భంగా 80 ఫెర్టిలిటీ క్యాంప్‌లు ఏర్పాటుకి పశువైద్యులు టీమ్‌గా వచ్చి చికిత్సలు అందిస్తారని తెలిపారు. తరువాత 3-8 నెలల వయస్సు గల ఆడ అవు లేగలను, గేదె లెగలకు బ్రూసెల్లోసిస్ వ్యాది నిరోధక టీకాలు వేయించుకోవాలని అన్నారు. దీని వల్ల వాటికి వ్యాధి నిరోధక శక్తి పెరిగి పెద్దది అయ్యాక గర్భం దాల్చినప్పుడు అభార్షన్ కాకుండా కాపాడు కోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిష్టన్న ఎంపీటీసీ సుస్మితా రమేష్, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, గొర్రెల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, పశువైద్యాధికారి దూద్‌రాం, పశు వైద్య సిబ్బంది సిబ్బంది సౌమ్య, స్వామి, విజయ్, సాయి, గంగన్న, రాజు, సుదర్శన్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలు ప్రారంభించిన విశ్వజిత్



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కుమారుడు రాథోడ్ విశ్వజిత్ శనివారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు ఓటములు సర్వసాధారణమైనప్పటికీ చివరికి ఒకటి రెండు టీంలే గెలుపొందుతాయని అన్నారు. కబడ్డీ మొదటి బహుమతి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రూ.31,116, కాగా రెండో బహుమతి పిడుగు సంజీవరెడ్డి రూ.20,1116,, మూడో బహుమతి గ్రామ సర్పంచ్ కళ్లెం కరుణాకర్ రెడ్డి రూ.10116ల బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్లెం కరుణాకర్ రెడ్డి, ఎంపీటీసీ ఎలుగు చంటి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంజీవ రెడ్డి, బోథ్ నియోజక అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, గ్రామస్తులు శ్రీనివాసరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రవి, రావుల నారాయణ, మాండ రాములు, అభిరామిరెడ్డి, కృష్ణ, పలువురు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఎన్‌సీసీ 32బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డ్రిల్, వెపన్, ఫీల్డ్ క్రాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, జడ్జింగ్ డిస్టెన్స్ ఐదు అంశాలపై పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి మొత్తం 500ల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు నిర్వహణ అధికారిగా బోర్డు మెంబర్ కెప్టెన్ గాలి అశోక్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కెప్టెన్ జగ్‌రాం, ఏఎస్ఓ, పీఏ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

డా.బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలు చేసిన అమారా ప్రసాద్‌పై తగిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం, దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణ సీఐ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, దళిత బహుజనుల ఆరాధ్యమైనటువంటి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై ఇటీవల దళితుడి ముసుగులో ఉన్న మనువాది అయినటువంటి అమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు. అమారా ప్రసాద్‌ను అరెస్టు చేసినప్పటికి, ఆయనపై పిడియాక్ట్ నమోదు చేసి కఠిన శిక్షలు అమలు పరచి, ఇంకోసారి ఇలాంటి దుశ్చర్యలకు ఏ ఒక్కరూ పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు డి.రాములు, బేర పరమేశ్వర్, గంగన్న, ప్రభాకర్, లస్మన్న, అశోక్ ఉన్నారు.

రోడ్డుపై ఆక్రమణలు తొలగింపు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్, ఈద్‌గాం, మేధా స్కూల్ వరకు ఉన్న వ్యాపార సముదాయాల ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు శనివారం తొలిగించారు. ఎవరైనా చట్టవ్యతిరేకంగా ఆక్రమణలు చేపడితే న్యూసెన్స్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆక్రమణలను తొలగించిన వారిలో ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్, ఏఎస్సై వర్మ, సిబ్బంది ఉన్నారు.

బాలల స్నేహపూరిత పాఠశాలలుగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఎంపీపీఎస్ యాపల్‌గూడ వేదికగా వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్ఎంసీలకు విధులు బాధ్యతలు గురించి, బాలల స్నేహపూరిత పాఠశాలలుగా తీర్చిదిద్దడానికి ఎస్‌డీపీలో చేర్చాల్సిన అంశాల గురించి, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు సుజాత ఖాన్, నారాయణ, నర్సయ్య, డీసీపీయూ పీఓ ఐసీ స్వామి, మహిత ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో విజయ డెయిరీ మాజీ చైర్మెన్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం జాతర సందర్భంగా విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. వీరి వెంట గ్రామ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, తిరుమల గౌడ్, గ్రామస్తులు రత్నాకర్ రెడ్డి, ఆసం రవి, అభిరామ్ రెడ్డి ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలకు సమాధాన పత్రాలు పంపిణీ ప్రారంభించినట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ తెలియజేసారు. పరీక్షా కేంద్రాల నిర్వహణకు కావాల్సిన మెయిన్ సమాధాన పత్రాలు, అడిషనల్ షీట్లు, ఎథిక్స్, ఎన్విరాన్ మెంటల్ పరీక్షల సామాగ్రిని ఇంటర్ విద్య కార్యాలయం నుంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్‌లు హాల్ టికెట్లు, బ్యాచ్ వారీగా లిస్టులు డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు తేదీల వారిగా వివరాలు తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ 20 కేంద్రాలు, ఒకేషనల్ 11 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 2713, ఒకేషనల్ 1463 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నెల 13న ఛీఫ్ సూపరింటెండెంట్లు, నిర్వాహకులకు శిక్షణ నిర్వహించి పరీక్షల సామాగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాల్‌లు సకాలంలో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని కోరారు.

'బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ-జన్నారం

బీసీలకు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య కో-కన్వీనర్లు, కాసెట్టి లక్ష్మణ్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీసీ బడి కార్యక్రమానికి జన్నారం పట్టణం నుంచి భారీగా బీసీలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కుల గణన చేసి బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీసీలకు 12 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ద్వారా బీసీలకు ఒరిగిందేమీ లేదు అన్నారు. బీసీలు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఐకమత్యంతో ఉంటేనే అది సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కొంతం శంకరయ్య, అల్లం లచ్చన్న, మామిడి విజయ్, దాసరి తిరుపతి, వెంబడి సత్యం, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా

- ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కాడే
- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానని నూతన ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కాడే అన్నారు. కలెక్టర్‌గా శనివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో రెండు సంవత్సరాలు జిల్లాలో పనిచేశానని అయితే అప్పుడు అదనపు కలెక్టర్‌గా ఉన్నప్పటికీ శిక్షణలో ఉన్నానన్నారు. అకాడమీలో నేర్చుకున్న పలు అంశాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉంటాయని విషయాలు శిక్షణ కాలంలో నేర్చుకున్నామని వివరించారు. గతంతో పోలిస్తే ఆసిఫాబాద్ అభివృద్ధి చెందిందని వివరించారు. గతంలో థియేటర్ లేదని జిల్లా కేంద్రంలో కొన్ని రోడ్లు అయ్యాయని బైపాస్ ఫ్లైఓవర్ కొత్తగా అయ్యిందని వివరించారు. భవిష్యత్తులో అధికారుల సమన్వయంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన హేమంత్‌కు కలెక్టర్ రాజేశ్యాం, డీఆర్ఓ రాజేశ్వర్, జిల్లా విద్యాధికారి అశోక్‌లు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

2018లో సివిల్స్ సాధన

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్కాడే మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించి అక్కడే ఇంటర్మీడియట్ వరకు విద్యనభ్యసించారు. పూణేలో కంప్యూటర్ ఇంజనీరింగ్ కోర్స్ పూర్తి చేసిన ఆయన ముంబైలో ఎంబీఏ పూర్తి చేశాడు. అనంతరం సిఐఎస్ఎఫ్‌లో కమాండర్ నాలుగు సంవత్సరాలు వైజాగ్ ప్రాంతంలో విధులు నిర్వహించారు. 2018లో సివిల్స్ సాధించి మొట్టమొదట కొమరంభీం జిల్లాలో ఒక సంవత్సరం పాటు శిక్షణ అనంతరం నిర్మల్ అదనపు కలెక్టర్ 2020లో బదిలీపై వెళ్లారు. తిరిగి రెండున్నర సంవత్సరాల తర్వాత కలెక్టర్‌గా జిల్లాకు వచ్చారు. తండ్రి ప్రభుత్వ విభాగంలో ఇంజనీర్‌గా పనిచేసి పదవి విరమణ పొందగా, తల్లి గృహిణిగా ఉంది. భార్య పేరు రేవతి కాగా, కూతురు ముక్త ఒకటో తరగతి చదువుతుంది. ఒక చెల్లి పేరు స్వాతి ఉన్నట్లు వివరించారు.

అటవీ అధికారులకు ఉద్యోగోన్నతి, బదిలీలు

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు బీట్ అధికారులకు సెక్షన్ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ కవ్వాల టైగర్ జోన్ చీఫ్ కన్జర్వేటర్ సీపీ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎఫ్ఎస్ఓలుగా పదోన్నతి పొందిన వారిలో పైడిపెల్లి బీట్ అధికారి, మీర్జాజియా అల్లా బేగ్, దండేపల్లి ఎఫ్బీఓ ఎస్.కృష్ణ, మల్యాల్ ఈస్ట్ ఎఫ్బీఓ ఎస్.శంకర్, మాకులపేట్ ఎఫ్బీఓ ఈ అర్చనలు ఉన్నారు. మిర్జాజియాఉల్లాబేగ్ బెల్లంపల్లి డివిజన్‌కు బదిలీ కాగా, మిగితా ముగ్గురు శంకర్, కృష్ణ, అర్చనలను యశంకర్ జిల్లా భూపాలపల్లి డివిజన్‌కు బదిలీ అయినట్లు ఎఫ్డీఓ సిరిపురం మాధవరావు తెలిపారు. అదే విధంగా మహాదేవపూర్ డివిజన్ ఫారెస్టు బీట్ అధికారులు విధులుగా నిర్వహిస్తూ ఫారెస్టు సెక్షన్ అధికారులుగా పదోన్నతిపై సయ్యద్ అబ్దుల్, ఎం.ఆనంద్‌లతో పాటు ఏటూరునాగారం, పెద్దపల్లిలో బీట్ అధికారులుగా విధులు నిర్వహిస్తూ సెక్షన్ అధికారులు పదోన్నతి పొందిన పి.యాదమ్మ, బీ. రాజవ్వలను జన్నారం డివిజన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఎఫ్డీఓ పేర్కొన్నారు. ఖాళీ ఏర్పడిన బీట్ అధికారుల స్థానంలో కొత్తగా రిక్రూట్మెంట్ అయిన వారిని నియమించడం జరిగిందని తెలిపారు.

పోలీసుల అక్రమ అరెస్టులు సరికాదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత ఉపాధ్యాయుల పక్షాన అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం కార్యక్రమాన్ని అనచొక్కే ప్రయత్నంలో భాగంగా ఉపాధ్యాయ సంఘ నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందూరావు అన్నారు. చలో అసెంబ్లీకి బయలుదేరకుండా నాయకులను ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, మా డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. 317 జీఓ బాధితులు స్వంత, స్థానిక జిల్లాలకు చేరే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జాదవ్ కిరణ్ కుమార్, టీఎస్ యూటీఎఫ్ నాయకులు హేమంత్ షిండే, కంపెల్లి ఉషన్న, మోతే శ్రీనివాస్ ఉన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

చెన్నూర్-2 ఇన్‌క్లైన్ గని ఆవరణలో 11 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం బి.సంజీవరెడ్డి, ఏరియా అధికారులతో సోలార్ పవర్ ప్లాంట్‌లో పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు మే నెల వరకు పూర్తి చేసి, విద్యుత్ ఉత్పత్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సోలార్ పవర్ ప్లాంట్ నుంచి కిష్టంపేట సబ్ స్టేషన్‌కు పంపించే విధంగా కావలసిన విద్యుత్ లైన్ పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, ఏరియా వర్క్ షాప్ డీజీఎం చంద్రశేఖర్ రెడ్డి, రీజినల్ సోలార్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్, సివిల్ డీజీఎం శివ రావు, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి, ఎస్ఈ ఏరియా వర్క్ షాప్ సతీష్ చక్రవర్తి, ఐటి సీనియర్ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే..!

- నిప్పర్పటానికి నీరు కరువు
- పక్కా భవనం లేక చెట్ల నీడనే వాహనాలు
- మరో రెండు ప్రతిపాదనలకే పరిమితం



తిర్యాణి మండలం పంగిడి మాదారలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే ఆశలు వదులుకోవల్సిన దారుణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడైన అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే సకాలంలో చేరుకొని మంటలను అర్పడానికి సరిపడా అగ్ని మాపక శకటాలు లేవు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 కిలోమీటర్లకు, యాభై వేల జనాభా ఉన్న చోట అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఆసిఫాబాద్ జిల్లాలో ఎక్కడ కుడా ఈ రూల్స్ అమలు కావడం లేదు. ప్రమాదాలను ఆధారంగా చేసుకుని అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు కొనసాగుతూ ఉండడంతో కొత్త కేంద్రాల ఏర్పాటు ముందుకు సాగడం లేదు. 70 నుంచి 100 కిలోమీటర్ల దూరంలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు వాహనాలు వెళ్లాల్సి వస్తుంది. ఈలోగా జరగల్సిన నష్టం జరిగిపోతుంది. సమయానికి అగ్ని మాపక శకటాలు రాకపోవటంతో బాధితులకు బూడిదే మిలుగుతుంది.



చెట్ల నీడలో ఉన్న కాగజ్‌నగర్ ఫైర్ ఇంజన్

ప్రమాదం సంభవిస్తే అంతే..

ఎండ కాలంలోనే అగ్ని ప్రమాదాలు అధికంగా జరగడానికి అస్కారం ఉంది. మండె ఎండల్లో చిన్న పాటి నిప్పు రవ్వ అంటుకున్న మంటలు చేలరేగి భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రమాదాలు సంభవిస్తే పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరుగుతుంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపే జరగాల్సిన ఆస్తి నష్టం జరుగుతుంది. ఆసిఫాబాద్ జిల్లాలో పదిహేను మండలల్లో కేవలం రెండు అగ్నిమాపక శకటలు మాత్రమే ఉన్నాయి. జిల్లాలో సరిపడా అగ్నిమాపక శకటలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగిన సంఘటన స్థలానికి శకటలు సకాలంలో చేరడం లేదు. దీనితో వేసవికాలంలో అగ్గి రాజుకుంటే ఆస్తులు బుగ్గి కావాల్సిందే.

అగ్నిమాపక శకటం అందనంత దూరం

జిల్లాలో పదిహేను మండలాలకు రెండు మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ఏజెన్సీ మండలాలైన కెరమెరి, జైనుర్, వాంకిడి, రెబ్బెన, తిర్యాణీ, లింగాపూర్, సిర్పూర్(యూ) పలు గ్రామాలు జిల్లా కేంద్రంనికి 50 నుండి 80 కిలోమీటర్ల దూరంగా ఉన్నాయి. సిర్పూర్ నియోజక వర్గంలోని కాగజ్‌నగర్‌లో అగ్నిమాపక కేంద్రం ఉంది. కౌటాల, బెజ్జూర్, చింతలమానెపెల్లి, దహెగాం, పెంచికలపేట్ మండలాలు ఉన్నాయి. అగ్నిమాపక కేంద్రాలకు దూరం 70 కిలోమీటర్లు ఉండటంతో ఆయా మండలల్లో ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక శకటలు పోయె వరకు జరగాల్సిన నష్టం జరుగుతుంది. దీనితో దూరం భారం ఎక్కువగా ఉండి అగ్నిమాపక శకటం అందకుండా పోతోంది. జైనూర్, లింగాపూర్ లాంటి మారుమూల మండలాల్లో ప్రమాదం జరిగితే ఆసిఫాబాద్ నుంచి శకటాలు వెళ్ళవల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ నుండి 50 కిలోమీటర్లు దూరంగా ఉన్నాయి. దీంతో ఎలాంటి అగ్ని ప్రమాదంజరిగిన పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

అసౌకర్యాలతో అగ్నిమాపక కేంద్రాలు

ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని ఎనిమిది మండలకు రెండు శకటలు మాత్రమే ఉన్నాయి. జైనుర్, లింగాపూర్ ఏజెన్సీ మండలాల్లో ప్రమాదం జరిగితే ఆసిఫాబాద్ లేదా ఉట్నూర్ నుంచి శకటలు రావడానికి యాభై కిలోమీటర్ల దూరమవుతోంది. ఒక శకటం పాతబడి పోయింది. మరమ్మతులు చేసిన సకాలంలో ఆ శకటం చేరుకుని మంటలు అర్పే వరకు జలగల్సిన నష్టం జరిగిపోయే ప్రమాదం ఉంది. కాగజ్‌నగర్ రెండు శకటలు ఉన్నాయి. ఒకటి మాత్రమే పని చేస్తుంది. అగ్నిమాపక కేంద్రంలో నీటి సౌకర్యం లేదు. పక్కనే ఉన్న ఆలయం నుండి నీటిని నింపుకోవల్సిన పరిస్థితి. లేక వాగులు, వ్యవసాయ బావిలో నుంచి శకటంలో నింపుతున్నారు. అసౌకర్యాల మధ్య అగ్నిమాపక కేంద్రాలు కొనసాగుతున్నాయి.

జిల్లాలో జరిగిన అగ్ని ప్రమాదాలు

సం	ప్రమాదాలు	ఆస్తినష్టం
2020	52	25లక్షలు
2021	30	38లక్షలు
2022	39	41 లక్షలు

మరో రెండు శకటాలు అవసరం

జిల్లాలోని జైనూర్, కౌటల మండల కేంద్రాల్లో మరో రెండు అగ్ని మాపక కేంద్రాలు అవసరం. ఈ రెండు మండల కేంద్రాల్లో అగ్ని మాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉన్నధికారులకు నివేదికను సమర్పించిన ఇప్పటి వరకు మంజూరు కాలేదు.

వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు

వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎండాకాలం అగ్ని ప్రమాదాల పై ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. చిన్న పాటి నిర్లక్ష్యం కూడా చేయాకుడదు. ప్రమాదం జరిగిన వేంటనే అగ్నిమాపక శకటలు వచ్చేవరకు నివారణ చర్యలు తీసుకుంటే కొంతవరకు నష్టన్ని నివారించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించిన పత్తి పంటలు అమ్మకుండా అధిక ధరలు వస్తాయని, అప్పుడే విక్రయించేందుకు చాలా మంది ఇంట్లోనే పత్తి నిల్వలు ఉంచుతారు. వేసవి కాలంలో ఇంటికి ముందు బయట చాలా మంది నిద్రపోతుంటారు. ఇలాంటి సందర్భంలోనే జిల్లాలో అగ్ని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్న నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.



అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

ఆసిఫాబాద్ : 08733- 279508
సెల్ : 8712699190,
కాగజ్ నగర్ : 08738- 238333
సెల్ : 8712699192

ఇంట్లో పత్తి నిల్వ ఉంచకూడదు

అజయ్, జిల్లా ఫైర్ అధికారి

ప్రతి సంవత్సరం వేసవికాలంలో ఎక్కువ వచ్చేవి. కానీ ప్రస్తుతం పండిన పత్తి ఇంట్లో నిల్వ ఉంచుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. మంచిర్యాల, కొమురంభీం జిల్లాలో ఈ మధ్యకాలంలో జరిగిన ప్రమాదాలు వీటికి ఉదాహరణ ప్రజలు ఎవరు కూడా పత్తిని ఇంట్లో నిల్వ ఉంచుకోకూడదు. పత్తి పంట ఆరుబయట పందిళ్ల కింద నిల్వ ఉంచుకోవాలి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందించాలి.

కాసులు కాంట్రాక్టర్‌కు, నష్టం రైతులకా..?

- గూడెం లిఫ్ట్ నాణ్యత లోపం ఎవరి తప్పు
- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి



నవతెలంగాణ-దండేపల్లి

కాంట్రాక్టర్ కాసుల కక్కుర్తితో గూడెం ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారిందని తెలంగాణ రైతు సంఘం(ఏఐకేఎస్) జిల్లా అధ్యక్షుడు సంకె రవి అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం గూడెం లిఫ్ట్, సాగు నీటి కాలువలు, ఎండిన పంటపొలాలను పరిశీలించారు. అనంతరం సంకె రవి మాట్లాడుతూ 30 వేల ఎకరాలకు సాగు నీటి కోసం రూ.121 కోట్లతో నిర్మించిన గూడెం లిఫ్ట్ ఏర్పాటు నుంచి ఏ ఒక్క పంటకు కూడా పూర్తిగా సాగు నీరు అందించలేదని అన్నారు. తరచూ మోటార్లు మొరయించడం పైప్ లైన్ లు పగిలి పోవడం జరుగుతుందన్నారు. అసలు ఏ పైప్ లైన్ వేస్తారని టెండర్ వేశారు, ఇనుప పైప్ లైన్‌లు ఎంత దూరం వేశారు, పైప్‌లు తరచూ ఎందుకు పగులుతున్నాయనీ ప్రశ్నించారు. కాంట్రాక్టర్ కాసుల దోపిడీపై అధికారులు, పాలకులు ఎందుకు స్పందిస్త లేరని అనుమానం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్, అధికారులకు, పాలకులకు ముందే జీఐ పైప్‌లు వేయాలని తెలియదా, ఇప్పుడు పైప్‌ల నాణ్యత గుర్తుకు వస్తుందా అని ఎద్దేవా చేశారు. వంద కోట్ల పైగా ప్రాజెక్ట్‌లో ఎవరికి ఎన్ని ముట్టాయో తెలియదు కానీ ,రైతుల పంటలు మాత్రం ఎండుతున్నాయన్నారు. వీరి నిర్లక్ష్యం వలన ఏటా వేల ఎకరాల్లో పంటలు ఎండుతున్నయని రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఇప్పుడు వరికి సాగు నీరు రోజు అవసరం అయిన దశలో మూడు రోజులుగా రెండు పంపులు చెడి పోయిన కానీ పట్టించుకోని కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. అసలు టెండర్ జీఐ పైపులకు వేశారా ఫైబర్ పైప్‌లకు వేశారా అనే విషయాన్ని బట్టబయలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో గూడెం లిఫ్ట్ ఆయకట్టు మొత్తానికి నీరు అందించక పోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అత్తె సాగర్, రమణా రెడ్డి, తిరుమలేశలు పాల్గొన్నారు.

ఆదివాసుల హక్కులను కాలరాస్తున్న సీఎం కేసీఆర్

- జల్, జంగల్, జమీన్ హక్కుల పరిరక్షణకు పోరాడుదాం
- ఆదివాసీ సంఘాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ సోయం చిన్నయ్య



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆదివాసీలకు పోడుహక్కు లేదని వాళ్లు ఆక్రమణదారులని తెలంగాణ అసెంబ్లీలో సీఎం కేసీఆర్ అనటం ముమ్మాటికి ఆదివాసీల జల్, జంగల్, జమీన్ స్వయంపాలన హక్కును కాలరాయడమేనని ఆదివాసీ సంఘాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ సోయం చిన్నయ్య అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ షెడ్యూల్ 5 చట్టాలను తుంగలో తొక్కుతూ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలు డిక్లరేషన్(హామీ పత్రాలు) రాసి ఇవ్వాలని అనటం ఆదివాసీ ప్రాంతాల్లోని గ్రామసభ అధికారాలను లాక్కోవడమే అని దుయ్యబట్టారు. ఇకముందు అడవిపై ఆదివాసులకు హక్కు ఉండదని అనటం సరికాదని, అనాదిగా ఆదివాసులు అడవి సంరక్షకులుగా అడవి ఉత్పత్తులపై ఆధారపడుతూ తమ జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదివాసీలను అడవి ఆక్రమణదారులుగా పేర్కొనడం సమంజసం కాదని, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ప్రభుత్వమే అడవి ప్రాంతాల్లో ఓపెన్ కాస్ట్ గనులు తెరిపిస్తూ అటవీ ఆక్రమణకు పాల్పడుతోందన్నారు. షెడ్యూల్ 5 ప్రాంతమైన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ తెరిపించి అక్కడి ఇనుప ఖనిజంను కొల్లగొట్టేందుకు కేసీఆర్ ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రయివేట్ కార్పొరేట్ కంపెనీలకు అడవిలోకి అనుమతులు ఇస్తూ ఆదివాసీలను నిర్వాసితులు చేస్తూ, సాధారణ జీవితం గడుపుతున్న ఆదివాసులకు అడవిపై హక్కు లేదనడం సరి కాదని తెలిపారు. మైదాన ప్రాంత నివాస కులాలైన వాల్మీకి, బోయ, ఖాయితీ లంబాడా, బేధార్, కిరాత, నిషాద, పెద్ద బోయలు, తండయారి, చుడువార్లు, భాట్ మదువార్లు, చమార్ మధువార్లు, మాలి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. ఇటీవల ఫారెస్ట్ శాఖ అధికారుల దాడిలో తీవ్రంగా గాయపడిన కోవ లింబారావుకు కనీస వైద్య సదుపాయం కూడా అందించలేదని విమర్శించారు. కోవ లింబారావును ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ గోండ్వానా కోయా సంఘం జిల్లా అధ్యక్షులు తలండి మధుకర్, కొమురంభీం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కోట సతీష్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్ హుస్సేన్, నాయకులు ముక్తార్, రేణికుంట్ల శ్రీనివాస్, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు భూ నిర్వాసితుల సంఘం ప్రతినిధి తలండి బిక్షపతి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్ష

- 934 మందికి 528 మంది హాజరు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఐదు సీట్ల భర్తీకి గానూ మొత్తం 934 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పట్టణంలోని నవోదయ, సెయింట్ క్లారెట్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు సీట్లకు ఉమ్మడి జిల్లా నుంచి 934 మంది దరఖాస్తు చేసుకోగా, 528 మంది పరీక్షకు హాజరుకాగా 407మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ చక్రపాణి తెలిపారు. పరీక్షల పరిశీలకులుగా శ్రీలత, వరలక్ష్మిలు వ్యవహరించారు. విద్యాలయం ప్రిన్సిపల్ చక్రపాణి పరీక్షలను పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరు కాగా, విద్యాలయం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎలాంటి లోపాలు తలెత్తకుండా, ప్రిన్సిపల్, విద్యాలయం ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెడికల్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని నూతనంగా మెడికల్ ఆఫీసర్‌గా వచ్చిన డాక్టర్ ఉమకి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే మెడికల్ ఆఫీసర్‌గా నియామక పై ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచిన డాక్టర్ ఉమాని అభినందించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాదావత్ ప్రకాష్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాంటెంకి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తుంగూరి గోపాల్, మండల నాయకులు దుర్గం రాజలింగం పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విధ్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మహాత్మ జ్యోతిబాపూలె(బాలికల) గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శృజనదేవి అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడమైదానంలో నిర్వహించిన క్రీడపోటీలలో వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన అంజలి, గౌతమి, వైష్ణవి, పల్లవి, అక్షర కే.వైష్ణవిలను శనివారం ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయురాళ్లు, పీఈటీ, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి వారు ఇష్టపడే క్రీడలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను రాష్ట్రం నుంచి బహిష్కరించాలి

నవతెలంగాణ-జన్నారం

అంబేద్కర్‌పై అనుచిత వాక్యాలు చేసిన హమారా ప్రసాద్‌ను తెలంగాణ నుంచి బహిష్కరించాలని మాలమహా నాడు జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత రాజ్యంగా నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నరు. హమారా ప్రసాద్‌పై ప్రభుత్వం పీడీ యాక్ట్ నమోదుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాల మహానాడు సీనియర్ నాయకులు బొట్ల సంజీవ్, భాగ్యరావు, కోడి సృజన్, వెంకటేష్,నరేష్ పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వాక్యాలు చేసిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చెర్యలు తీసుకోవాలని బౌద్ధ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నగరాడే రాజు, దుర్గం తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన హమారా ప్రసాద్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో అంబేద్కర్ గురించి ఆయన వ్యక్తి గత జీవితం గురించి అనుచిత వాక్యాలను నిరసిస్తూ అతనిపై సిర్పూర్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరిగితే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దుర్గం విక్రమ్, దుర్గం ప్రవీణ్, ఉపాధ్యక్షుడు భేండ్దరి శ్రీనివాస్, గోమసే వాసుదేవ్. దుర్గం భారత్, గాయక్వడ్ మోహన్‌లాల్ పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు



వేమనపల్లి : ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నీల్వాయి ఎస్సై నరేష్ తన సిబ్బంది, టీఎస్ఎస్పీ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం ఫారెస్ట్ రోడ్ గుండా, మంగనపల్లి, వేమనపల్లి గ్రామాల పరిధిలోని బ్రిడ్జ్, కల్వర్ట్ లను, ఫెర్రి పాయింటలను, అనుమానిత ప్రదేశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీల్వాయి ఎస్సై నరేష్ మాట్లాడుతూ నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు, ఆర్‌ఓపి, ఏరియా డామినేషన్ నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా మీ నివాస ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

తూనికలు, కొలతలకు తాళం

- జిల్లా మొత్తానికి ముగ్గురే దిక్కు
- మోసాలకు గురవుతున్న వినియోగదారులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మార్కెట్‌లో ప్రతినిత్యం ప్రజలు ఎన్నో రకాల వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. వస్తువులపై ముద్రించిన ధర కంటే ఎక్కువ ధరను వ్యాపారులు వసూలు చేస్తూనే ఉన్నారు. కిలో అని కళ్ళ ముందే తూకించి ఇచ్చిన కందిపప్పు వాస్తవానికి ఎనిమిది వందల గ్రాములే ఉంటోంది. పాలు, మాంసం, పండ్లు లేదా ఇతర పదార్థాల కొలత విషయంలోనూ తరుగు సర్వసాధారణంగా ఉంటోంది. పెట్రోలు బంకుల్లో ఆపరేటర్ల చేతివాటం వల్ల వాహనదారులు ఎంతో కొంత నష్టపోక తప్పటం లేదు. ఇలా నిత్యం ప్రజల జీవితంలో జరిగే తూనికలు కొలతల మోసాలను అరికట్టేందుకు పనిచేయాల్సిన అధికార యంత్రాంగం కొమురంభీం జిల్లాలో నిద్రావస్తలో ఉంది. కాగజ్‌నగర్‌లో తూనికలు కొలతలశాఖ కార్యాలయం ఉన్నప్పటికీ ఎప్పుడూ తాళం వేసే ఉంటోంది. కనీసం అధికారుల ఫోన్ నెంబర్లు సైతం బోర్డుపై ముద్రించలేదు. దీంతో మోసాలకు గురైన వినియోగదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

ఏజెన్సీ ప్రాంతంలో మోసాలు

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో దుకాణాల్లో, వారసంతల్లో నాణ్యతలేని సరకుల విక్రయాలు, తూకంలో తేడాతో అమాయక గిరిజనులు మోసపోతుంటే పట్టించుకునే వారు కరువయ్యారు. జిల్లాల పునర్విభజన తర్వాత ప్రజలకు మరింత చేరువై మోసాలను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం ఆచూకీ కనిపించడం లేదు.



కాగజ్‌నగర్‌లోని పాత తహసీల్దార్ కార్యాలయ భవనంలో ప్రస్తుతం తూనికలు కొలతలశాఖ జిల్లా కార్యాలయం కొనసాగుతోంది. ఈ శాఖ ఆదిలాబాదు జిల్లా అధికారి ఎండీ అబ్దుల్ జలీల్ ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా కొనసాగుతున్నారు. ఒక అసిస్టెంట్, అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా మొత్తానికి ముగ్గురే దిక్కు. కార్యాలయం ఎప్పుడూ మూసివేసి ఉంటోంది. జిల్లా అధికారి ఎండీ అబ్దుల్ జలీల్ ఇన్‌ఛార్జి కావడంతో ఏ చోట ఉన్నది ఎవరికీ తెలియదు. ఇక ఇక్కడి అసిస్టెంట్, అటెండర్ తనిఖీల పేరిట ఎప్పుడూ కార్యాలయంలో అందుబాటులో ఉండడంలేదు. ఎక్కడ తనిఖీలు చేశారన్నదీ సమాచారం ఉండదు. దీంతో వినియోగదారుల రక్షణ కోసం ప్రవేశ పెట్టిన తూనికలు, కొలతల చట్టం అమలుచేసే బాధ్యత నెరవేరడంలేదు. కిరాణ దుకాణాలు, రైస్ డిపోలు, రైస్ మిల్లుల్లోని డిజిటల్ తూకాలు, బాట్లు తదితర వాటిని తనిఖీ చేసి స్టాంపింగ్ చేయాల్సి ఉండగా మొక్కుబడిగా విధి నిర్వహణ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉండని వస్తువులు వినియోగదారుడికి దొరకనప్పుడు ఏం చేయాలి, ఎవరిని ప్రశ్నించాలని వినియోగదారులు వాపోతున్నారు. తక్కువ తూకం, తక్కువ కొలతలు వేస్తూ వస్తువులపై ముద్రించిన ధరలకు మించి విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేసిన చర్యలు కానరావడంలేదు.

జోరుగా పత్తి విక్రయాలు

పత్తి క్రయవిక్రయాల్లో కీలకమైన ఆదిలాబాద్, ఆసిఫాబాద్ లాంటి ప్రాంతాల్లోనూ ఏడాది కోసారి ఎవరికీ తెలియకుండా కాంటాలకు స్టాంపింగ్ జరుగుతోంది. పత్తి పంటనే కాకుండా సోయా చిక్కుడు, కందులు, శనగ పంటల నాణ్యతను నిర్ధారించే తేమ పరికరాల వినియోగంలోనూ శాస్త్రీయతను నిరూపించాల్సి ఉంది. బట్టల దుకాణాల్లో కొలమానాలు, నాణ్యత, కూరగాయల మార్కెట్లు, కిరాణ, బంగారం ఒకటేమిటి వర్తక వాణిజ్య రంగాల్లో ప్రభుత్వ లైసెన్సు కలిగిన కాంట్రాక్టర్లతో పర్యవేక్షణ చేయాల్సి ఉండగా అలాంటి చర్యలేమీ కనిపించడంలేదు. నిబంధనల ప్రకారం షాపు స్థాయిని బట్టి రూ.2 నుంచి 5 వేల వరకు జరిమానా వసూలు చేస్తారు. తూనిక రాళ్లకు ప్రతి రెండేండ్లకోసారి తూనికలు, కొలతల శాఖ నుంచి ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలి. ఇందుకు కొంత నగదును తూనికలు, కొలతల శాఖకు ఫీజు రూపంలో చెల్లించాలి. అదే ఎలక్ట్రానిక్ కాంటా అయితే ఏడాదికి ఒకసారి తనిఖీలు చేయించుకొని స్టాంపులు వేయించుకోవాలి. అయితే వ్యాపారులు 70 శాతం మంది ప్రామాణిక ముద్రలు వేయించుకోవడంలేదు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే ఇలా చేస్తున్నారు. అధికారులు తమ లక్ష్యాలను పూర్తిచేయాలన్న ఉద్దేశంతో అడపాదడపా దాడులు చేసి మొక్కుబడిగా ముగిస్తున్నారు. పలు చోట్ల తోపుడు, కూరగాయల మార్కెట్లు, కిరాణా వ్యాపారాల్లో ఇప్పటికీ పాతపద్దతిలోనే విక్రయిస్తున్నారు. సగటున కిలోకు 100 గ్రాముల వరకు నష్టపోతున్నట్లు అంచనా.

తనిఖీలు చేపడుతున్నాం : ఎండీ అబ్దుల్ జలీల్, తూనికలు కొలతల శాఖా జిల్లా అధికారి

రెండు జిల్లాల బాధ్యతలు నిర్వహించాల్సి ఉండడంతో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండలేకపోతున్నా. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిత తనిఖీలు నిర్వహించి 2022 జనవరి నుంచి డిసెంబర్ వరకు 45 మంది వ్యాపారస్తులపై కేసులు నమోదు చేశాం. రూ. 3,26,500 జరిమానాలు విధించాం. స్టాంపింగ్ ద్వారా రూ. 11,53,748 వసూలు చేశాం. తనిఖీలకు వెళ్ళే సమయంలో కార్యాలయం మూసి ఉంటోంది. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు వస్తు విక్రయాలు జరిగితే, తూనికల్లో తేడాలు ఉంటే సెల్ : 9346949880 సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

యువతి వివాహానికి పెద్దనపల్లి సర్పంచ్ సాయం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీలోని సోమగూడెం కొత్త కాలనీలో పేదింటి యువతి వివాహానికి ఆ గ్రామ సర్పంచ్ వేముల కృష్ణ సాయం అందజేశారు. సోమగూడెం కొత్త కాలనీకి చెందిన వజ్ర అనే ఒంటరి మహిళ కుమార్తె ప్రవళిక వివాహం కాగా వారికి సర్పంచ్ కళ్యాణ కానుక కింద రూ.5 వేలతో పాటు చీరే సారే సర్పంచ్ వేముల కృష్ణ దంపతులు పెళ్లి కూతురుకు అందించారు. గ్రామ పంచాయతీలోని ప్రతి పేదింటి ఆడ బిడ్డల పెళ్లికి తమ వంతుగా పెద్దపల్లి సర్పంచ్ కళ్యాణ కానుక కింద సాయం అందిస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పంబాల తిరుపతి, హిందుమతి, కొమురక్క, స్థానిక నాయకులు కూకట్ల దేవేందర్, శ్రీధర్, నరేశ్ పాల్గొన్నారు.

పోడు భూములపై కేసీఆర్ వ్యాఖ్యలు గర్హనీయం

- సీపీఐ(ఎంఎల్) డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోడు భూములపై ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని సీపీఐ ఎంఎల్ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోడు భూములపై ఆదివాసులకు ఎటువంటి హక్కులు లేవని, అది ఆక్రమణ అని, ఆయన దయతలిచి పోడు పట్టాలిస్తున్నట్టుగా చెప్పటం, దద్దమ్మల్ల శాసనసభ్యులు నోరు మెదపకుండా కూర్చోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అటవీపై హక్కులు పాలకవర్గాలు ఇచ్చిన భిక్ష కాదని అన్నారు. పోడుపట్టాలివ్వాలంటే, సర్పంచులు, ఎంపీటీసీలు, అఖిలపక్ష నాయకులు, మళ్లీ పోడు కొట్టరని సంతకాలు పెడితే పట్టాలిస్తారనడం దారుణం అన్నారు. ముఖ్యమంత్రి ఎటువంటి నిబంధనలు పెట్టకుండా పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఆదివాసి, ఆదివాసీతర పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండి.చాంద్ పాషా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, నాయకులు వైష్ణవి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్

సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామంలో ముదిరాజ్ సంఘం వారు నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి సాయం చేయాలని అధ్యక్షుడు పిట్టల తిరుపతి, సంఘం నాయకులు కేసీఆర్ సేవా దళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన తండ్రి కీర్తిశేషులు బొద్దుల నారాయణ జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణానికి 25,116 రూపాయలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీసీ విద్యార్థి సంఘం నాయకుడు పిట్టల రమేష్ ముదిరాజ్, కేసీఆర్ సేవా దళం జిల్లా అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతళ్ళ కాంతయ్య, నాయకులు బొద్దుల వెంకటేశం, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికి ఇండ్లు ఇవ్వాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కోడం రమణ

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

అర్హులైన వారందరికి డబుల్ బెడ్‌బూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. శనివారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలందరికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పి ఎనిమిదేండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు తంగళ్ళపల్లి మండలంలో ఏ ఒక్కరికి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ కాలనీలో స్వయంగా లబ్దిదారులను పర్మిషన్ సాకుతో నిర్మించుకోకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు స్థలాలు లేని వారికి గుంట స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో నిర్మించుకునే స్తోమత లేని వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పట్టాలు రెగ్యులరైజేషన్ చేసి పట్టాలతో పాటుగా నిర్మించుకోవడానికి ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ఆదివారం నుంచి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అర్హుల నుండి దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో నాయకులు మోర అజయ్, అన్నల్దాస్ గంగాధర్, రమేష్ చంద్ర, గోరిత్యాల రాజమల్లు, కుడికాల కనకయ్య, ముశం శంకర్, కోడం వేణు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఓబీసీ ఉద్యమాలు చేపడతాం

పెద్దపల్లి: దేశవ్యాప్తంగా ఓబీసీ ఉద్యమం చేస్తామని. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో 16 రాజకీయ పార్టీలతో ఓబీసీ ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో ఓబీసీ సమస్యలపై జరిగిన రెండు రోజుల రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరై శనివారం తిరిగి వచ్చిన సందర్భంలో అనేక విషయాలపై విలేకరులతో ఆయన మాట్లాడారు. రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ హాతేవాలేతో పాటు రాజ్యసభ సభ్యులు కే.కేశవరావు, బడుగు లింగయ్య యాదవ్‌తో సంప్రదింపులు చేసినట్టు వివరించారు. ఆయనవెంట నాయకులు జెట్టి సతీష్, కట్ట నరేంద్రచారి, శ్రీనివాస్‌గౌడ్, సంపత్, రమణ, సాగర్, శ్యామ్, దిలీప్, స్వరూప, తదితరులు ఉన్నారు.

కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే ఉత్తమం

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్
- జిల్లా కేంద్రంలో లోక్ అదాలత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేసుల పరిష్కారం కోసం రాజీ మార్గమే ఉత్తమమైనదని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ జడ్జి వెంకటేష్ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం జడ్జిలు ఉమామహేశ్వరి షరీనాలతో నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 473 కేసులు పరిష్కరించగా అపరాధ రుసుము రూపంలో రూ.364100 వసూలయ్యాయి. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల విషయంలో రాజీమార్గమే రాజమార్గం అన్నారు. అదేవిదంగా సమాజంలోని ప్రతి ఒక్కరు న్యాయసేవలు అందుకోవాలని, చట్టం ఎవరి చుట్టం కాదన్నారు. వర్గవిభేదదాలు లేకుండా అందరికీ సమానన్యాయం ఇవ్వడమే ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భోనగిరి సతీష్ బాబు, సెక్రటరీ నరహరి, న్యాయవాదులు ముక్త సురేష్, జగన్ మోహన్, చంద్రకుమార్, శ్యాం కుమార్, జీవీఎస్ ప్రసాద్, కిషోర్, ప్రదీప్, విద్యాసాగర్, ప్రభుత్వ న్యాయవాది దీపక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పోతపల్లి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి హత్ సే హత్ జోడో పాదయాత్ర ద్వారా గడపగడపకి కాంగ్రెస్ పార్టీ సేవల గురించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ అరాచకపు పాలనను ప్రజలు గుర్తించాలన్నారు. సంక్షేమ పథకాల పేరుతో కేసీఆర్ కుటుంబ పాలన వలన ప్రజలు ఎన్నో రకాల బాధలు అనుభవిస్తున్నారన్నారు. ముఖ్యంగా మంచిర్యాల నియోజకవర్గంలోని రైతుల పంటలకు నీరు అందక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వివరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లక్షెట్టిపేట్ మండలంలో పత్తా లేవని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి పేదలను ఆదుకున్నట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు అధికారంలో లేకపోయినా కూడా ఆయన చేస్తున్న సేవలను గుర్తించి రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచి బీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నం మంగ చిన్నన్న, ఎంపీటీసీ సుజాత సురేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి సతరసి బానేశ్, పాయిలి చిన్నయ్య, రాజారావు, దుమ్మని సత్తయ్య, చందు, సుభాన్, హాజీ, షఫీ, పోతపెళ్లి గ్రామ అధ్యక్షుడు ఆసాది చిన్నయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలమెల్ల రాజు, మండల అధ్యక్షులు రమేష్ పట్టణ అధ్యక్షులు ఆరిఫ్ పాల్గొన్నారు.

12న పాదయాత్రను విజయవంతం చేయాలి

- సీఐటీయూ ఆసిఫాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జనగామ జిల్లా పాలకుర్తి నుంచి 28వ తేదీ హైదరాబాద్ ఇందిరా పార్క్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నామని ఇట్టి పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ అన్నారు. శనివారం ఆసిఫాబాద్ సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు జాడి మోరేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. కనీస వేతనంతో పాటు నెలలకు సరైన సమయంలో జీతం ఇవ్వకపోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని అన్నారు. జీవో 60ను అమలు చేసి కార్మికులకు ఇచ్చే ఇన్సూరెన్స్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఉద్యోగ భద్రతతో పాటు పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇప్పించాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టే పాదయాత్ర విజయవంతం చేయాలన్నారు. అనంతరం పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా నాయకులు నగేష్, శంకర్, పుష్పలత పాల్గొన్నారు.

ప్రకటించిన ఎస్టీ జాబితాను ఉపసంహరించాలి



నవతెలంగాణ-కాసిపేట

తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో మరో పదకొండు తెగలను ఎస్టీ జాబితాలో కలపడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేస్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ట్లాడారు. తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని గల్లి నుంచి ఢిల్లీ దాకా ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఒకవైపు ఎస్టీ జాబితాలో లంబాడీలను చేర్చడంతో పాటు పోడు భూములపై ఆదివాసులకు హక్కులు లేవనడం విచారకరమని అన్నారు. ముఖ్యమంత్రి వెంటనే చేసిన ప్రకటన ఉపసంహరించకపోతే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో తుడుం దెబ్బ నాయకులు ఆత్రం జంగు, కనకరాజు, మడావి వెంకటేష్, పెంద్రం ప్రభాకర్, మడావి గంగారాం, గిడం శేఖర్, రోడ్డ అనిల్, కడప శాంసుందర్, కడప అనంతరావులు పాల్గొన్నారు.

15 నుండి కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు శారీరక దేహదారుఢ్య పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు శారీరక దేహదారుఢ్య పరీక్షలు, ఎంపిక ప్రక్రియ నిర్వహణ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో విడత శారీరక దేహదారుఢ్య పరీక్షలు ఫిబ్రవరి 15 నుండి 17 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా, గత నెలలో చేసిన శారీరక దేహదారుఢ్య పరీక్ష ప్రక్రియ అనుభవంతో ఈసారి ఎంపిక ప్రక్రియను మరింత పకడ్బందీగా ఏర్పాట్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు శారీరక దేవదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా 16వ తేదీన శారీరక దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవకతవకలకు విమర్శలకు తావు లేకుండా శారీరక పరీక్షలు జరిగే మైదానంలో సీసీ కెమెరాలు నిఘా ఉంచుతున్నామని తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలో శనివారం మాలీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుట కోసం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎస్టీ జాబితాలో తమ కులస్తులను చేర్పించినట్లయితే అన్ని రకాల ప్రభుత్వ ఫలాలు అందుతాయని మాలి కులస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు కొట్రంగి రామకృష్ణ, ఆదే అశోక్, కుట్రంగి భీమన్న, సురేష్, తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు నరేందర్ గౌడ్, జాహిద్ అలీ, జహీర్ హుస్సేన్ పాల్గొన్నారు.



తాండూర్ : వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేంకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు ముస్కే సాగర్ మాట్లాడుతూ మమ్మల్ని గుర్తించి మా కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంగం నాయకులు జమ్మిషెట్టి గట్టుమళ్లు, ముస్క పోశం, జమ్మిశెట్టి లసుమయ్య, సూరపతుల పొషం, ముస్కే రమేష్, గుజ్జులా పొశం, అబ్బార్ల రాయమల్లు, గోగు శ్రీకాంత్, జమ్మిషెట్టి రాజం, ముస్క మల్లయ్య పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.